పోలంరాజు శారద




# స్థానచలనం

అక్టోబర్ నెలేగానీ ఎండ మాడ్చేస్తున్నది. హైద్రాబాద్‌లో అంతే. పేరుకు చలికాలమే. కానీ సంవత్సరంలో ఆరు నెలలకు పైగా ఎండలే. పొద్దున్న సమయం పది అవుతోంది. సావిత్రి అప్పుడే పని ముగించుకుని తీరిగ్గా పూజకు పూలు కోస్తున్నది.

"అమ్మణ్ణి ఎండ మాడుస్తున్నది కూసిన్ని దాహం ఈమ్మా" గొంతు వినిపించి గేటు వైపు చూసింది. ఎవరో కోయ దొర. చాలా పెద్దవయసులాగ ఉన్నాడు. మొహం నీరసించి ఉన్నది. పాపం దాహానికి నోరార్చుకుపోతున్నట్టున్నాడు. పెరట్లో చెట్లకు నీళ్లు పెట్టటానికి పంపు ఉన్నది. గేటు తెరిచి "అదిగో పంపు మోటారు వేస్తాను. మంచినీళ్లు తాగు" అని మోటారు స్విచ్ వేసింది.

కడుపు నిండా నీళ్లు తాగి తన దగ్గరున్న డొక్కులో నీళ్లు పట్టుకొని మొహం కడుక్కున్నాడు.

"తల్లీ సీతమ్మ తల్లాలె ఉండావు. ఒక సిటెం ఈడ కూకుంటానమ్మా" జవాబు కోసం కూడా ఎదురు చూడకుండా అక్కడే వేపచెట్టు నీడన సిమెంటు అరుగు మీద కూర్చున్నాడు.

"ఎవరు సావిత్రీ?" భర్త రామనాథం బయటికి వచ్చాడు.

"ఎవరో కోయదొర. ఎండకు సొమ్మసిల్లి మంచినీళ్లు తాగి సేద తీరుతున్నాడు"

"సరేలే త్వరగా పంపేయి"

"అమ్మా సీతమ్మ తల్లే అమ్మ కడుపు చల్లగా లచ్చిందేవిలాగా కళకళ్లాడుతూ ఉండావమ్మా. నీ ఇంట సిరులుండాయి. లవకుశల్లాంటి కొడుకులు. సీరామ చంద్రుడమ్మా నీ పెనిమిటి. కొండదేవర ఆన" మొదలెట్టాడు.

ఈ కోయదొరలంతే ఏదో మొదలెడతారు. తరువాత అదని ఇదని చెప్పి నర దిష్టి అని తాయెత్తులూ శాంతులూ అంటూ అయినకాడికి గుంజుతారు. ఆ విషయం తెలిసిన సావిత్రి ఏం మాట్లాడకుండా వింటూ ఉండిపోయింది.

"నీ ఇంట సకల జనాలకు తాన చలనం ఉంది తల్లే. అన్ని సుబాలే జరుగుతాయి. లచ్చిందేవి బంగారు కడేలతో నీ ఇంట ఆడుద్ది. చిన్ని కిట్టయ్య అందెలతో అడుగులేత్తాడు"

"అంటే?" అర్థం కానట్టు చూసింది.

"పై ఏటికి నీకే తెలుత్తది తల్లే వత్తానమ్మా. మళ్లీ రాములోరి లగ్గానికి వత్తా" అంటూ లేచాడు.

అక్కడే ఉండి వింటున్న రామనాథం జేబులోంచి పది రూపాయలు తీసి ఇవ్వబోయాడు.

"వద్దు దొరా వద్దు. ఈ రూకలు నాకొద్దు. పై ఏటికి మీ తానచలనం అయ్యాక నేనే వత్తా. పంచెలు తీసుకపోతా" వెళ్లిపోతున్న కోయదొరను అందరూ విస్తుపోయి చూస్తూ నించున్నారు.

"ఏంటే అమ్మాయీ వాడి మాటలు. ఒక్క ముక్క అర్థం కాలా. స్థానచలనం అంటాడు. పై ఏడు బట్టలు పెట్టమంటాడు"

"అవును డబ్బులు కూడా వద్దన్నాడు. ఎవరో వింత మనిషిలా ఉన్నాడు" రామనాథం ఆశ్చర్యం.

"జాగర్తరోయ్ ఇట్లాగే పగలు ఆనుపానులు కనుక్కుంటారు. రాత్రిళ్లూ కన్నం వేయటానికి వస్తారు" తల్లి ఆందోళన.

"పాపం ముసలాడు. అయినా గేటు దగ్గర నుంచి నీళ్లు తాగి అక్కడే సేదతీరి పోయాడు. అస్సలు ఇంటి గుమ్మం లోపలికి కూడా చూడలేదు. కన్నం వేసే వాళ్లయితే ఇళ్లు వాకిళ్లు అన్నీ పరిశీలిస్తారు" సావిత్రి సమర్థింపు.

"సరేలే ఇంతకూ అతను చెప్పింది ఏవిట్ట?" ఎందుకు వచ్చాడు అన్న మీమాంస అయిపోయింది. ఇప్పుడు అన్న మాటలకు అర్థమేమిటీ అన్నది చర్చనీయాంశం.

"స్థాన చలనం అన్నాడు కదరా అబ్బాయీ. అంటే ఏమిటిరా?" జయమ్మగారి ప్రశ్న.

"స్థాన చలనం అంటే ఉన్న చోటు నుంచి కదలటం అన్నమాట. అంటే ఉద్యోగాలు చేసే వాళ్లకయితే ట్రాన్స్‌ఫర్ అనుకోవచ్చు. కానీ అతనేమిటీ సకల జనాలకు అన్నాడు" పెద్ద కొడుకు సంజయ్ వివరణ అనుమానం కలిపి. అతను బాంక్‌లో ఆఫీసర్‌గా ఉన్నాడు.

"ఇల్లు మారడం కూడా కావచ్చు" మీనా సవరణ.

"సరే సరే అతనేదో అన్నాడు వెళ్లాడు. దానికి అంత చర్చ అనవసరం. పదండి పదండి మీ ఆఫీసులకు అసలే ఆలస్యమయింది" తండ్రి అదిలింపు.

అందరూ వాళ్ల వాళ్ల దారిన వెళ్లిపోయినా యేదో సర్ది చెప్పటానికి అట్లా అన్నాడే కానీ రామనాథానికి మనసులో శంక పట్టుకున్నది.

సామాన్యంగా కోయదొరలకు ఇంట్యూషన్ ఉంటుంది. వాళ్లు చెప్పే విషయాలు సాధారణంగా నిజమవుతాయని తనకు అనుభవపూర్వకంగా తెలుసు. రామనాథంగారు అంతలా చింత పడటానికి కూడా బలమైన కారణమున్నది. అది తెలుసుకోవాలంటే ఆయన గురించి ఇక్కడ వివరించాలి.

రామనాథంగారు ఉంటున్నది ఒక అద్దె ఇల్లు. ఆయన సెక్రటేరియట్‌లో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. ఉద్యోగంలో ఉండగానే, అందరూ చౌకగా స్థలాలు కొంటుంటే ఆయన కూడా ఊరికి దూరంగా వనస్థలిపురంలో స్థలం కొని విశాలంగా ఇల్లు కట్టుకొని చుట్టూ చెట్లు మొక్కలూ పెట్టుకొని హాయిగా ఉండసాగాడు.

ఆయనకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. తల్లి, భార్య. ఇదీ వారి కుటుంబం. చుట్టుపక్కల బోలెడన్ని స్కూళ్లు, కాలేజీలు, షాపింగ్ సెంటర్‌లు ఉండటంతో దేనికీ సిటీలోకి వెళ్లకుండా కాలం గడచిపోతున్నది.

ఆయనకు కాలనీ నుండి ఆఫీసుకు డైరెక్ట్ బస్సులున్నాయి. ఇంటి దగ్గర బస్సులో సీటులో కూర్చుంటే ఆఫీసు దగ్గర దిగేదాకా నిశ్చింత. రిటర్ను కూడా అంతే సుఖంగా ఉండేది. పిల్లలు పెద్దవాళ్లయినారు. పెద్దకూతురుకి పెళ్లి చేశారు. అల్లుడు అమెరికాలో ఉద్యోగం. పెద్ద కొడుకు సంజయ్ ఎం.కాం చదివి బాంక్ పరీక్షలు రాసి ఆఫీసరు అయ్యాడు. చిన్నకొడుకు రాజీవ్ ఇంజనీరింగ్ చదివి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కూతురు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతూనే కంప్యూటర్ కోర్స్ చేస్తున్నది. తండ్రి పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు.

ఇప్పుడు మొదలైంది సమస్య. కాలనీలు బాగా ఎక్కువైనాయి. జనం రద్దీ పెరిగింది. రోడ్లు కిక్కిరిసిపోయాయి. ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్లాలంటే ఇంతకు ముందు 40 నిమిషాలు పడితే ఇప్పుడు గంటన్నర పడుతున్నది. పెద్ద కొడుకు బాంక్ మెహదీపట్నం, చిన్నవాడు బేగంపేట. కూతురు ఆబిడ్స్.

వాళ్ల సణుగుడు మొదలైంది. "తీసుకొచ్చి ఊరు చివర పడేశారు. ఆఫీసుకెళ్లాలంటే విసుగొస్తున్నది. స్కూటర్ నడపాలంటే భయంకరమైన ట్రాఫిక్. బస్సులో ఆ రష్ భరించలేకపోతున్నాము"

చిన్నవాడు ఏదైనా ప్రాజెక్టు ఉంటే అర్థరాత్రి అపరాత్రి దాకా ఆఫీసులోనే ఉండాల్సి వచ్చేది. ఆ సమ

యంలో ఇల్లు చేరేదాకా ఇంట్లో వాళ్లకు కంగారు.

తల్లి కూడా గొణగటం మొదలెట్టింది. "ఒరేయ్ నాయనా ఇక్కడ చిన్న చిన్న గుళ్లే కానీ ఒక పెద్ద గుడే లేదు. ఊళ్లో ఉంటే ఏ శంకరమఠానికో రామకృష్ణ ఆశ్రమానికో వెళ్లేవాళ్లం"

ఈ పోరు అంతా చూశాక రామనాథం సావిత్రిలకు కూడా అనిపించేది ఆయన రిటైర్ అయినాడు ఊళ్లో ఉంటే ఏదో సాయంత్రాలు త్యాగరాజ గానసభకో సుందరయ్య భవన్‌కో వెళ్లి కాలక్షేపం చేయవచ్చు. ఇక్కడ జన సంచారం ఉన్నా ఊరి చివర ఉండేటప్పటికి అడవిలో ఉన్నట్లే అనిపించసాగింది.



కానీ ఇంత సంసారానికి ఊళ్లో ఇల్లు అద్దె అంటే అమ్మో! పేలిపోతుంది. అని ఆలోచించసాగారు.

ఇంతలో వాళ్ల దూరపు బంధువు చాలా ఏళ్లుగా హైద్రాబాద్‌లో ఉంటూ విద్యానగర్‌లో ఇల్లు కలిగి ఉన్నారు. తరువాత బేగంపేటలో ఫ్లాటు కూడా కొన్నారు. ఆయనది పిల్లాపాపా కలిగిన సంసారం. అందరూ కలిసి ఉండే ఉద్దేశ్యంతో విద్యానగరులో వేయి గజాల స్థలంలో పెద్ద ఇల్లు కట్టుకున్నారు. కానీ పిల్లలందరూ అమెరికా వెళ్లిపోయి అక్కడే పర్మినెంట్‌గా సెటిల్ అయినారు. తల్లి తండ్రీ కూడా తరుచుగా పిల్లల దగ్గరకు వెళ్తూ ఉంటారు. ఇండియాలో ఉన్నప్పుడు ఫ్లాట్లో ఉంటూ పెద్ద ఇల్లు ఎవరికైనా అద్దెకివ్వాలని అనుకుంటున్నారు. అద్దె మీద వచ్చిన డబ్బుల మీద కన్నా వాళ్లకు ఆ ఇంట్లో పిల్లాజెల్లలతో కళకళ్లాడే కుటుంబం కావాలని కోరిక. ఆ సమయంలోనే రామనాథం గారు అద్దె ఇల్లు కోసం చూస్తున్నారని తెలిసి వెంటనే కబురంపారు.

ఆ విషయం విన్న రామనాథంగారి కుటుంబ సభ్యులు చాలా సంతోషించారు. తక్కువ అద్దెతో హైద్రాబాద్ నడిబొడ్డున అంత పెద్ద ఇల్లు దొరకడం చాలా అదృష్టంగా భావించి వెంటనే ఇల్లు మారారు. అది, రామనాథంగారి ఇంటి కథ. ఇప్పుడేమో ఈ కోయదొర వచ్చి స్థానచలనం అనేటప్పటికీ కొత్త భయం పట్టుకున్నది.

ఇల్లుగలాయన ఎక్కడ ఇల్లు ఖాళీ చేయిస్తాడో అని అనుమానం మొదలైంది.

ఇంక బాంకులో ఉద్యోగం చేస్తున్న సంజయ్‌కి విద్యానగరు వచ్చాక పెళ్లి అయింది. భార్య సృజన గర్భవతి. అతని భయం అతనిది. స్థానచలనం అంటే ఉద్యోగం ట్రాన్స్‌ఫర్ వస్తుందా అమ్మో! ఎట్లా ఇన్నాళ్లూ అమ్మను నాన్నను వదిలి ఎప్పుడూ ఉండలేదు. ఇప్పుడు తనకు పొరుగూరు ట్రాన్స్‌ఫర్ తప్పేటట్లు లేదు. ఈ విధంగా ఆలోచించి దిగులు మొదలైంది.

కోడలు సృజనకు ఎక్స్పెటెడ్గా ఉన్నది. ఇంట్లో అందరూ చాలా ఆప్యాయంగా, ప్రేమగా ఉంటారు. కానీ ఎక్కడో మనసులో ఏదో వెలితి. తనూ, తన భర్తా, చంటి బిడ్డా. ఎంత మధురంగా ఉందో ఆలోచన. కానీ అత్తమామల ఆప్యాయతకు దూరంగా పోవాలంటే బాధగా ఉంది. ఏమిటో కోయదొర వచ్చి వెళ్లాక కలగాపులగపు ఆలోచన. కొంత ఆనందం కొంత బాధ.

ఇంక రెండో కొడుకు రాజీవ్‌కైతే ఆనందానికి హద్దులే లేవు. సీటు వచ్చి అమెరికా వెళ్లిపోయినట్టే ఊహలు.

అదే భావన కూతురు మీనాకు. ఆ అమ్మాయికి పెళ్లి సంబంధాలు వెతుకుతున్నారు. అక్కయ్యకు లాగా తను కూడా అమెరికా పెళ్లికొడుకుని చేసుకొని ఇప్పుడే విమానంలో ఎగురుతున్నంత ఆనందం.

సావిత్రికేమీ అర్థం కావట్లేదు. స్థానచలనం అన్నాడు. అది కూడా ఇంటల్లిపాదికీ అన్నాడు. ఏమిటో అయోమయంగా ఉన్నది. పిల్లల ఆలోచనే ఆవిడకు వచ్చింది. ఏమో పెద్దవాడికి ట్రాన్స్‌ఫర్, చిన్నవాడు చదువుకు అమెరికా, కూతురు పెళ్లయి అత్తారింటికి సరేసరి. కానీ తను, భర్త, అత్తగారు, ఎక్కడకి వెళ్లాలి. ఏమో చెప్పలేము. పెద్ద కూతురికి పురిటి రోజులు. తను వెళ్లవలసి వస్తుందేమో.

ఆ మాటే అత్తగారితో కూడా అన్నది. ఇంక ముసలావిడ మొదలెట్టింది నస. "ఒరేయ్ అబ్బాయీ మీరందరూ మీమీ దారులలో వెళ్లేట్టుగా ఉంటే నన్ను మన ఊరికి పంపండి అక్కడ మా తమ్ముడి దగ్గర ఉంటాను."

ఈ విధంగా ఒక వారం పది రోజులు తెగ మల్లగుల్లాలు పడ్డారు అందరూనూ. తరువాత మెల్లిమెల్లిగా కోయదొరను అతను చెప్పిన విషయాన్ని మరిచిపోయి ఎవరి పనుల్లో వాళ్లు పడ్డారు.

ఒకసారి ఇంటి యజమాని కలిసి ఆ ఇల్లు ఖాళీ చేయాల్సిన అవసరమే రాదు అని ఘంటాపథంగా చెప్పాడు. అమెరికాలో కూతురికి అత్తగారే పురుడు పోయటానికి నిశ్చయమైంది. పెద్దకొడుక్కి ఊళ్లోనే వేరే బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ అయింది. చిన్నవాడికి ఈసారి కూడా అమెరికాలో సీటు దొరకలేదు. ఎక్కడి వాళ్లా అక్కడనే ఉండిపోయారు.

మరో రెండు నెలల్లో, ఇరవై రోజుల తేడాతో కూతురూ కోడలూ పురుడుపోసుకున్నారు. కూతురికి కూతురూ, కోడలికి కొడుకూ పుట్టారు. మూడో నెల రాగానే చంటి బిడ్డలను ఎత్తుకొని బాలింతరాళ్లు రామనాధంగారి ఇల్లు చేరారు. బారసాల జరిపి పాపకు శ్రీలక్ష్మి, బాబుకు వంశీ అని పేర్లు పెట్టారు.

రోజులు గడుస్తున్నాయి. పిల్లలిద్దరూ అప్పుడప్పుడే దోగాడటం మొదలెట్టారు.

ఎండాకాలం మొదలైంది. ఉగాది వెళ్లింది. ఊరంతా శ్రీరామనవమికి ముస్తాబవుతున్నది. తెల్లారితే శ్రీరామకళ్యాణం.

వాకిట్లో "అమ్మణ్ణీ కూసింత దాహమియ్యమ్మా" వినిపించి బయటకు వచ్చింది సావిత్రి.

స్నానం చేసి పూజకు సిద్ధమవుతున్న రామనాథంగారు, ఎక్కడో విన్న గొంతులాగా అనిపించి మడిబట్టతోటే బయటకు వచ్చారు.

"ఏం సీతమ్మ తల్లీ మననానికి వచ్చినానా"

"ఓ నువ్వా ఆరునెలల నాడు వచ్చిన కోయదొరవు కదూ" సావిత్రి అడిగింది.

"అమ్మో బాగానే మతికొచ్చినానే"

"ఏమయ్యా మళ్లీ వచ్చావే" ముసలావిడ కూడా కుతూహలంగా బయటికి వచ్చింది.

"చెప్పాగదా తల్లే రాములోరిలగ్గానికి వత్తానని"

"చెప్పావులే. కానీ స్థానచలనం అన్నావు ఇంటిల్లిపాదికి అన్నావు. ఏమీ వివరంగా చెప్పలేదు. అస్సలు నువ్వన్నదానికి అర్థమున్నదా. లచ్చిందేవన్నావు చిన్నికిట్టయ్య అన్నావు. ఏంటీ మతలబు" ఏకధాటిన అడిగేసారు రామనాదంగారు.

"బాబుగోరు నేనన్న ముక్కలు బాగానే మతికెట్టుకున్నారే" నవ్వుకుంటూ మళ్లీ వేపచెట్టు కింద సెటిలయినాడు.

అప్పుడే దోగాడుతూ పిల్లలిద్దరూ ఒకరిమీద ఒకరు పడుతూ గడప దాటటానికి ప్రయత్నిస్తున్నారు. వెంటనే సావిత్రి రామనాథం గబుక్కున చేరి ఒకరిని ఎత్తుకున్నారు.

"చూశారా బాబుగారు ఇందులో మతలబు ఏమున్నదీ బాబుగోరి చేతిలో చిన్నికిట్టయ్య అమ్మణ్ణి చేతిలో లచ్చిందేవి" నిజంగానే ఇద్దరి కాళ్లకు దిష్టి తగలకుండా రాగి వెండి కలిపిన మువ్వల కడియాలు తొడిగారు.

జయమ్మ బయటికి వచ్చి "ఓరినీ అసాధ్యం కూలా చక్కగా చూసినట్టే చెప్పావే. ఆరు నెల్ల క్రితమే పుట్టబోయే పిల్లల పేర్లతో సహా చెప్పావే. అయినా కోయదొరా స్థానచలనం అంటూ ఏదో చెప్పావే అదేంటయ్యా"

"పెద్దమ్మగోరూ మిమ్మల్ని ఇంటికాడ ఏమని పిలుత్తారు?"

"అదొక ప్రశ్నా నా కొడుకు అమ్మా అంటాడు. కోడలు అత్తా అంటుంది. పిల్లలు బామ్మా అంటారు. అయినా ఇప్పుడు ఆ ప్రస్తావన ఎందుకు?"

"అక్కడికే వస్తున్నానమ్మా ఇప్పుడు తాతమ్మ అయ్యుండారా లేదా బాబుగోరకి తాత పెమోషను, అమ్మణ్ణికి అవ్వ పెమోషనొచ్చి మీ తానాలలోంచి కదిలారా లేదా. నీ మనుమడు నాయనా మామా అయ్యాడా లేదా? ఏం అమ్మణ్ణీ, బాబుగోరూ మీ తానచలనాలు బాగుండాయా?" సకల జనాలకు ఎట్లా స్థానచలనం కలిగిందో వివరించాడు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ.

"బాబుగోరూ నా పంచలచాపు నాకిప్పిత్తే నేనెళ్లాల. రేపు రాములోరి లగ్గమేల్టికి భద్రాచలం ఎళ్లాల"

అందరూ అతని మాట చమత్కారానికి చాలా సంతోషించారు. ఆనందంగా పంచల చాపే కాక కడుపు నిండా అన్నం పెట్టి భద్రాచలానికి టిక్కెట్టు డబ్బులు కూడా ఇచ్చి పంపారు.

## హన్సిక తమిళం

తెలుగులో అవకాశాలు తగ్గడంతో కుర్రతార హన్సిక దృష్టిని తమిళంవైపు మరల్చింది. ఆమె కృషి ఫలించి ఇప్పుడామెకి అక్కడ మంచి ఆఫర్లే వస్తున్నాయి. ప్రస్తుతం విజయ్, ధనుష్‌లతో రెండు భారీ చిత్రాల్లో నటిస్తున్న హన్సిక తనకి తమిళ భాషపై పట్టు గనక వుంటే ముందు ముందు ఇంకా మంచిదనే ఆలోచనకు వచ్చిందిట. అందుకనే ఓ ట్యూటర్‌ని పెట్టుకుని రోజూ తమిళ భాషను చక్కగా నేర్చుకుంటోందిట. ముంబయ్ నుంచి వెళ్లిన ఖుష్బూ, సిమ్రాన్, నమిత, తమన్నాలు కోలీవుడ్‌లో మంచి సక్సెస్‌ని సాధించినట్టే తనూ సాధిస్తుందేమో!

